ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023



గుండెపోటుతో విఆర్ఒ మృతి



ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని డంగభద్ర విఆర్ఒ చింతాడ ప్రభాకర్ (42) గుండెపోటుతో శనివారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాలూరు మండలం బాగువలస ఆయన స్వగ్రామం. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మరణం పట్ల స్థానిక సర్పంచ్ సీమల సుజాత, వైసిపి నాయకులు బాబు భువనమోహన్ రావు, తహశీల్దార్ డివి సీతారామయ్య, విఆర్ఒ సంఘ నాయకులు సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో

పలుచోట్ల భారీ వర్షాలు

- నేలకూలిన చెట్లు, ఇళ్లు
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం



శివన్నపేటలో కూలిపోయిన ఇల్లు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో ఉదయం 7 నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదమయ్యాయి. దీంతో పాటు ఉక్కపోతతో ప్రజలు నానా అవస్థలుపడ్డారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయి. భారీ ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. గత పది రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశనాన్ని ఇచ్చింది. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సీతంపేట, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం తదితర మండలాల్లో ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. పార్వతీపురం పట్టణంలో ఈదురుగాలులకు టిఆర్ఎంఎం ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న చెట్టు కూలిపోయింది. ఈ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కురుపాం : మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి కురుపాం మేజర్ పంచాయతీలో గల శివన్న పేటలో సారికి వీధికి చెందిన రొంపల్లి లక్ష్మి ఇంటిపై చెట్టుపడి పాక్షికంగా దెబ్బతింది. పండ వీధికి చెందిన జి.రాము పూరిల్లు పై కప్పు ఎగిరిపోయింది. అలాగే కూరాకుల వీధిలో విద్యుత్ వైర్లపై చెట్టు పడి విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. అంతేకాక మండలంలో పలు గిరిజన గ్రామాల్లో ఎక్కడికక్కడ చెట్లు విరిగి విద్యుత్ వైర్లు, స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు స్పందించి త్వరితగతిగా విద్యుత్ పునరుద్ధరణ చేయాలని అలాగే పాక్షికంగా పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు అధికారులు అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

సీతంపేట : ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం ప్రారంభమైంది. సుమారు గంటన్నరపాటు వర్షం కురవడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వీరఘట్టం: మండలంలో పెను గాలులతో కూడిన వర్షం పడింది. గత వారం రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో గాలులతో పాటు వర్షం కురవడంతో కొంతమేర ఉపశమన కలిగింది. మరోవైపు రహదారులు బురదమయం కావడంతో పాదాచార్లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

పాలకొండలో వర్షం

పాలకొండ: పట్నంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు ఎండ వేడిమికి నానా అవస్థలు పడ్డారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చేసుకొని ఉరుములతో కూడిన వర్షం పడడంతో వాతావరణం కొంత చల్లబడింది.



తోటపల్లి బ్యారేజీ

10న తోటపల్లి నీరు విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్

రైతులంతా ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఈ నెల 10న తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేస్తున్నట్లు తోటపల్లి రిజర్వాయర్ అధికార యంత్రాంగం తెలియజేసింది. 117.89 కిలోమీటర్ల పొడవు కలిగిన తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా 131221 ఎకరాలకు సాగు నీరందుతుంది. ఈ కాలువ 1200 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ కాలువ ద్వారా మన్యం జిల్లాలో గల సీతానగరం, బలిజిపేట మండలాలకు ఎక్కువగా సాగునీరు అందుతుంది. 117.89 కిలోమీటర్లు పొడవు కలిగిన ఈ కాలువ మన్యం జిల్లాలో 23 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తూ సీతానగరం, బలిజిపేట మండలంలోని 13683 ఎకరాలకు సాగునీరందిస్తుంది. 37.65 కిలోమీటర్ల పొడవు కలిగిన తోటపల్లి ఎడమ కాలువ మన్యం జిల్లాలో 31200 ఎకరాలకు సాగునీరు అందించగా, 20 కిలోమీటర్ల పొడవు కలిగిన తోటపల్లి కుడి కాలువ ద్వారా 8344 ఎకరాలకు సాగునీరందుతుంది. కుడికాలు ద్వారా మన్యం జిల్లాలో 3644 ఎకరాలకు నిరంతరం సాగుకు సాగు నీరందుతుంది. తోటపల్లి రిజర్వాయర్ పాత ఆయకట్టు 64,000 ఎకరాలు కాగా, దీనిలో మన్యం జిల్లాలో 41,946 ఎకరాలు ఆయకట్టు కలిగి ఉంది. కుడికాలువ ద్వారా 3644 ఎకరాలకు, ఎడమ కాలు ద్వారా 31602 ఎకరాలకు నిరంతరం జరుగుతుంది.

2021 లో తోటపల్లి ప్రధాన కాలువ పనుల నిమిత్తం రూ.59.58 కోట్లతో కొత్త పనులకు టెండర్లు వేగా, రూ.52.52 కోట్లకు ఒప్పందం కుదిరింది. వీటిలో సుమారు రూ.8 కోట్లుకు గానూ పనులు పూర్తి చేయగా, రూ.1.21 కోట్లు బిల్లులు చెల్లించారు. రూ.4.33 కోట్లు బిల్లులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. కాలువల్లో పుడికతీతలు, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులను ఉపాధి హామీ పనుల ద్వారా చేయడం జరుగుతుంది.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

జెవివి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-విజయనగరం

జన విజ్ఞాన వేదిక ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తల ప్రాంతీయ శిక్షణ తరగతులు ఆదివారం విజయనగరంలో జరిగాయి. ఈ శిక్షణలో సైన్సు-శాస్త్రీయ దృక్పథం.. అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలుగా ఎటువంటి చైతన్యం కలిగి ఉండాలి, దేశంలో అశాస్త్రీయ పోకడలు ఏ విధంగా పెరుగుతున్నాయో వివరించారు.

శాస్త్ర విజ్ఞానం-మానవ వికాసం అనే అంశంపై జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ ప్రసంగించారు. శాస్త్ర విజ్ఞానం మానవ మనుగడకు, అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడింది, ప్రస్తుతం శాస్త్రీయ విజ్ఞాన ఫలాలు కొంతమందికే ఎందుకు అందుతున్నాయో తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక నిర్మాణం-కర్తవ్యాలు అనే అంశంపై జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు ప్రసంగించారు. భవిష్యత్తు కార్యక్రమాలను రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజగోపాల్, త్రిమూర్తులు రెడ్డి వివరించారు.

గిరిజన సంక్షేమ డిడికి చిత్తూరు బదిలీ

ఉత్తర్వుల నిలుపుదల కోసం తెరవెనుక పైరవీలు

రిలీవ్ చేయకుండా జిల్లా అధికారుల తాత్సారం

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం ఐటిడిఎ గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ బి.సూర్యనారాయణని చిత్తూరు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గత నెల 31న ఉత్తర్వులు వెలువడ్డాయి. చింతూరు గిరిజన సంక్షేమ అధికారిగా ఉన్న బి.సూర్యనారాయణకు గతంలో పూర్తి అదనపు బాధ్యతలతో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇక్కడ ప్రభుత్వం నియమించింది. ఆయనకు ముందున్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్‌ను ఆ పోస్టు నుంచి తప్పించాలని పెద్ద ఎత్తున గిరిజన, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేశాయి. సీనియర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారినే గిరిజన సంక్షేమ డిడిగా నియమించాలని పట్టుబట్టాయి. దీనికి డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర కూడా సీనియర్ గిరిజన ఎటిడబ్ల్యుఒనే డిప్యూటీ డైరెక్టర్ గా నియమించాలని సిఫార్సు చేశారు. అయితే ఆయన సిఫార్సులకు విరుద్ధం గా చింతూరు డిటిడబ్ల్యుఒగా ఉన్న బి.సూర్యనారాయణను డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పుడు ఆయన్ను చిత్తూరు డిటిడబ్ల్యుఒగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలై నాలుగు రోజులు కావస్తున్నా ఐటిడిఎ అధికారులు ఇంతవరకూ ఆయన్ను రిలీవ్ చేయలేదు. దీంతో ఆయన తన బదిలీ నిలుపుదల కోసం తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరను కలిసి తన బదిలీ నిలుపుదల చేయాలని కోరినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్ర స్థాయి అధికారుల ద్వారా తన బదిలీ నిలుపుదల కోసం పైరవీలు మొదలు పెట్టినట్టు సమాచారం. సూర్యనారాయణను రిలీవ్ చేసి సీనియర్ ఎటిడబ్ల్యుఒకు డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించాలని ఆదేశిస్తూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఆ ఉత్తర్వులను అమలు చేయాల్సి ఉంది. కానీ ఆయన్ను రిలీవ్ చేయకుండా జాప్యం చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు వున్నాయేమోనన్న ప్రచారం జరుగుతోంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర కూడా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీనియర్ ఎటిడబ్ల్యుఒనే గిరిజన సంక్షేమ డిడిగా నియమించాలని సిఫార్సు చేస్తున్నారు. ఏమైనా ఐటిడిఎలో కీలకమైన డిడి నియామకం మరోసారి వివాదాస్పదమవుతుందా? ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సుఖాంతమవుతుందా అనేది తేలాల్సి ఉంది.



మంత్రి రాజన్నదొరకు అభినందనలు తెలుపుతున్న గురుకుల ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పారదర్శకంగా బదిలీలపై హర్షం

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడంపై గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను కలిసి అభినందించారు. గత నెల 31న గిరిజన గురుకుల డైరెక్టరేట్‌లో నిర్వహించిన బదిలీలు గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకంగా జరిగాయని వారు హర్షం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని తెలిపారు. గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వెంకటనాయుడు, ఉపాధ్యక్షుడు వేణు ప్రసాదరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు రాజన్నదొరను ఆయన నివాసంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

8న ట్రైబల్ వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 9న నుంచి 12వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా ట్రైబల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఈ నెల 8న విశాఖలోని రైల్వే మైదానంలో రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టివై భగవాన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంటిఎస్ టీచర్లను రెగ్యులర్ టీచర్లుగా గుర్తించాలి

ప్రజాశక్తి-సాలూరు

2008 డిఎస్సీ ఎంటిఎస్ టీచర్లను రెగ్యులర్ టీచర్లుగా గుర్తించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2008 డిఎస్సీలో 70/30 రేషియోలో నష్టపోయిన అభ్యర్థులను ప్రభుత్వం 2021 జులైలో మినిమం టైం స్కేల్ టీచర్లుగా నియమించిందని పేర్కొన్నారు. బిఇడి, డిఇడి కోటా కారణంగా చివరి నిమిషంలో నష్టపోయిన 2196 మందిని రాష్ట్ర వ్యాప్తంగా ఎంటిఎస్ టీచర్లుగా నియమించిందన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో వందమంది నియామకయ్యారని తెలిపారు. వీరికి 12నెలల జీతం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పది నెలలకే ఇస్తోందని పేర్కొన్నారు. వీరిపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ కనబరుస్తున్నదని విమర్శించారు. 2008 డిఎస్‌సి మెరిట్‌లో చివరి నిమిషంలో ఉద్యోగం కోల్పోయిన వారిని ఎన్నో పోరాటాల తర్వాత ఎంటిఎస్ టీచర్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులుగా వీరిని నియమించాలని ఆ ప్రకటనలో కోరారు.

చెరకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అధికారులను కోరారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో లచ్చయ్య పేట సుగర్ కేన్ ఉప కమిషనర్ జివివి సత్యనారాయణతో పలు అంశాలపై చర్చించారు. చెరకు తరలింపులో భాగంగా సంకిలి తీసుకెళ్లేందుకు 35 కిలోమీటర్ల వరకు రవాణా ఖర్చును రైతులే భరించాల్సి వస్తుందన్నారు. పంటను నేరుగా వచ్చి తీసుకుంటామని చెప్పి, షరతులు విధించడం సరికాదన్నారు. సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడి, రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని సత్యనారాయణ తెలిపారు.

ఖరీఫ్‌కు సర్వం సిద్ధం

- ఆర్‌బికెల్లో అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి
- ప్రజాశక్తితో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.రాబర్ట్ పాల్ ముఖాముఖి



రానున్న ఖరీఫ్‌కు జిల్లా వ్యవసాయశాఖ సర్వం సన్నద్ధమైందని ఆ శాఖ జిల్లా అధికారి కె.రాబర్ట్ పాల్ చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేశామన్నారు. అలాగే ఈ ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించడంతో చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ యంత్రసేవా పథకాలను అర్హులైన రైతులందరికీ అందజేస్తున్నామని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్లో ఐదు వేల మంది రైతులకు కౌలు రైతు కార్డులు (సిసిఆర్‌సి) ఇవ్వడానికి లక్ష్యం నిర్దేశించామని తెలిపారు. వీటితో ఖరీఫ్‌లో జిల్లా వ్యవసాయశాఖ చేపడుతున్న కార్యక్రమాలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- ప్రజాశక్తి, కలెక్టరేట్

? ఖరీఫ్ సీజన్లో ప్రధానమైన పంటలేమిటి?

మన జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వరి. మిగిలిన అన్ని పంటల కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. ఆ తర్వాత స్థానంలో మొక్కజొన్న, చెరకు, నువ్వులు ఉంటాయి. రాగులు, మినుములు, పెసలు, కందులు వంటి పప్పుదినుసులు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. అన్ని రకాల పంటలకు బీమా సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

? ఖరీఫ్‌కు ఎంత మొత్తంలో విత్తనాలు పంపిణీ చేయనున్నారు? సబ్సిడీ ఏ విధంగా ఉంటుంది?


రాబోయే ఖరీఫ్ సీజన్లో 30,765 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు అందించేందుకు సిద్ధం చేశాం. షెడ్యూల్డ్ మండలాల్లో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై ఈ విత్తనాలు సరఫరా చేస్తున్నాం. ఇతర ప్రాంతాల్లో వరి విత్తనాలపై కేజీకి పది రూపాయలు చొప్పున రాయితీ ఇస్తూ, పచ్చిరొట్ట విత్తనాలపై 50 శాతం వరకు సబ్సిడీ ఉంటుంది. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బికెలను సంప్రదించి, డీ-కబుషి యాప్ (బయోమెట్రిక్ విధానం) ద్వారా వారి వివరాలు రిజిస్టర్ చేసుకొని, రైతు వాటా చెల్లించాక వారికి విత్తనాలను సదరు ఆర్‌బికె వద్దనే సరఫరా చేస్తాం.

? ఈ ఏడాది ఖరీఫ్ వరి ఎంత విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది? ఏ రకాల విత్తనాలను ప్రోత్సహిస్తున్నారు?

రాబోయే ఖరీఫ్‌లో వరి పంట సుమారు లక్షా75వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన విత్తనాలైన ముఖ్యంగా ఎంటియు-1064 (అమర) రకం 12670 క్వింటాళ్లు, ఆర్‌జిఎల్-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 5040 క్వింటాళ్లు, ఎంటియు-1121 (శ్రీధృతి) 3450 క్వింటాళ్లు, బిపిటి-3291 (సోనామసూరి) రకం 1587 క్వింటాళ్లు, బిపిటి-5204 (సాంబమసూరి) రకం 1410 క్వింటాళ్లు, ఎంటియు-1061 (ఇంద్ర) రకం 1420 క్వింటాళు ,, ఎంటియు-7029 (స్వర్ణ) రకం 1090 క్వింటాళు ,, ఎన్ఎల్ఆర్-34449 (నెల్లూరు సన్నాలు) రకం 96 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 రకం 132. క్వింటాళ్లు, ఎంటియు 118 రకం 80 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయనున్నాం. మిల్లింగ్ క్వాలిటీ సమస్యలు ఉత్పన్నమౌతున్నందున, రాబోయే ఖరీఫ్ సీజన్లో వరి రకం ఎంటియు-1121 (శ్రీధతి) సాగును గణనీయంగా తగ్గించాలని, ఎంటియు-1224 సాగును పూర్తిగా చేపట్ట వద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

? చిరుధాన్యాల సాగు ఏ విధంగా ఉంది?

2023ను అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించినందున, చిరు ధాన్యాల సాగును పెద్ద ఎత్తున చేపట్టేందుకు గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు, సీతంపేట మండలాల్లో రైతులను గుర్తించి వారికి 90శాతం రాయితీపై విత్తనాలను సరఫరా చేస్తున్నాం. ఇందు కోసం 126 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు మే నెల రెండు / మూడు వారాల నుంచి పంపిణీ చేస్తున్నాం. అలాగే తొలకరిలో ఖరీఫ్ పంటకు ముందుగా సాగు చేసే పచ్చిరొట్ట విత్తనాలైన జనుము 1375- క్వింటాళ్లు, పిల్లిపెసర 120 క్వింటాళ్లు, జీలుగ - 1875 క్వింటాళ్లు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని ఆర్‌బికెలకు తరలించే కార్యక్రమం ఇప్పటికే జరుగుతుంది. వీటితో పాటుగా, కంది 93 - క్వింటాళ్లు, అపరాలు - 45 క్వింటాళ్లు, వేరుశనగ - 185 క్వింటాళ్లు విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశాం.



? ఎరువుల అవసరం జిల్లాలో ఏ మేరకు ఉంది?

రాబోయే ఖరీఫ్ సీజన్లో ఆర్‌బికెల ద్వారా 15వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేసే లక్ష్యానికి గానూ, ఇప్పటి నుండే ఆర్బీకేలకు ఎరువులను తరలించే ఏర్పాట్లు చేశాం. మార్కెఫెడ్ గోదాముల్లో ఇప్పటికే 1100 టన్నుల యూరియా, 1000 టన్నుల డిఎపి ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

? వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ఏ విధంగా అమలవుతుంది?

వైయస్సార్ యంత్ర సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రెండు విడతల్లో, ఆర్బీకే స్థాయిలో 159 యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయటమైంది. వీటిలో 94 యూనిట్లు ట్రాక్టర్లతో ఏర్పాటు చేశాం. 65 యూనిట్లు ట్రాక్టర్ లేకుండా పరికరాలతో మాత్రమే ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఏర్పాటు చేయని 143 ఆర్‌బికెల్లో యంత్ర సేవా కేంద్రాలను గ్రౌండింగ్ చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చాం.

? వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ ఎంతమంది లబ్ధి పొందారు?

గత 4 నాలుగేళ్లలో జిల్లాలో లక్షా 39,505 రైతు కుటుంబాలకు గానూ రూ.689.5 కోట్లును ఈ పథకం ద్వారా 3 విడతలుగా జమ చేయటమైంది. నాలుగో విడత ఖరీఫ్ ప్రారంభానికి ముందుగా ఇచ్చే పిఎం కిసాన్ నిధులకు, రైతుల బ్యాంకు అకౌంట్లు ఆధార్ అనుసంధానం అవ్వాలి. కావున, ఇ-కెవైసి, మరియు ఎన్‌పిసిఐ అనుసంధానం ఈ నెలాఖరులోగా సంబంధిత ఆర్‌బికెల వద్ద పూర్తి చేసుకోవాలి. నేటి వరకు 1,15,769 మంది రైతులకు గాను 88,726 మంది రైతులకు (77%) ఇ-కెవైసి పూర్తి అయినది.

కౌలు రైతుల నమోదు ప్రక్రియ ఏ విధంగా జరుగుతుంది?

రాబోయే ఖరీఫ్ సీజన్లో ఐదు వేల మంది రైతులకు కౌలు రైతు కార్డులు (సిసిఆర్‌సి) ఇవ్వడానికి లక్ష్యం నిర్దేశించాం. గడచిన ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 4365 మంది అర్హులైన కౌలు రైతులను గుర్తించి, వారికి సిసిఆర్‌సి కార్డులను జారీ చేశాం. వారిలో 2806 మంది వైస్సార్ రైతుభరోసా పథకంలో అర్హులుగా ధ్రువీకరించటమైంది. సిసిఆర్‌సి కార్డు పొందిన భూమి లేని బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కౌలురైతులు, దేవాదాయ భూమి సాగుదారులు రైతు భరోసా పథకానికి అర్హులుగా నమోదు చేయబడుతున్నారు .

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-విజయనగరం

దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన జెఇఇ అడ్వాన్స్ పరీక్ష విజయనగరం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జెఎన్‌టియు జంక్షన్‌లోని అయాన్ డిజిటల్ జోన్, సీతం ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగింది. అయాన్ డిజిటల్ జోన్‌లో 510 మంది, సీతం కళాశాలలో 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలు కళకళలాడాయి.

పులిగుమ్మి, గోలవలసలో ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పులిగుమ్మి, వన్నాం, ఈదలవలస, గోలవలస గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎనిమిది ఏనుగుల గుంపు ఆదివారం సంచరిస్తుంది. ఈ సందర్భంగా ఆ పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతూ ప్రాణాలు గుప్పట్లో పెట్టుకుని బిక్కుమంటూ ఉంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పంటలు నాశనం చేస్తున్నాయని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక తామంతా రైతు కుటుంబాలమేనని, వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, పొలాలకు వెళ్లకుంటే తమకు జీవనం సాగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏ సమయంలో ఏనుగులు తమపై దాడి చేస్తాయో తెలియక భయాందోళనకు గురవుతూ పొలాలకు వెళ్లలేకపోతున్నామని చెబుతున్నారు. కావున అటవీశాఖ అధికారులు స్పందించి జనజీవనానికి దూరంగా ఏనుగులను తరలించాలని కోరుతున్నారు.



రాజన్నదొరను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

డిప్యూటీ సిఎంకు ఎమ్మెల్యే బొత్స పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సీఎం రాజన్నదొరను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం కాలికి స్వల్ప గాయం కావడంతో ఆయన విశ్రాంతిలో ఉన్నారు. ఆయన్ను కలిసిన బొత్స అప్పలనరసయ్య యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు.



గ్రామస్తులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

తాళ్లబురిడిలో గడపగడపకు...

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని తాళ్లబురిడిలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకొని వారి వివరాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఎలాంటి అవినీతి, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి శోభారాణి, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరం పుష్పగిరి కంటి హాస్పిటల్ సమక్షంలో పెదపెంకిలోని-2 పాఠశాల వద్ద నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యాన ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 172మందికి పరీక్షలు చేయగా, 14 మందిని శస్త్రచికిత్సకు తరలించారు. రోగులను పుష్పగిరి కంటి హాస్పిటల్ ఆప్తాలమిస్ట్ వి.కిరణ్ పరీక్షించారు. శిబిరంలో సమాజ సేవకులు రాంబాయమ్మ, నేరల్ల హరి, ముక్కు సాయి. ఈర్ల మధు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు భూదేవి

గిరిజన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు గిరిజన చట్టాలపై అవగాహన అవసరమని గిరిజన నాయకులు, టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. ఆదివారం పొంద్ర, బాపన్నగూడలో గిరిజనులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన జిఒలను క్రమేపీ కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిఒ 3ను రద్దు చేసి గిరిజన యువతకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎందరో గిరిజన నేతలు హక్కుల కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఇప్పటి పరిస్థితుల్లో ఈ హక్కులు కాపాడేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కుంపి, మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసిపి భౌతిక దాడులు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలోని అంశాలపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతోనే వైసిపి నాయకులు టిడిపి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. కడప జిల్లాలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌పై జరిగిన కోడిగుడ్ల దాడి, ఆదివారం నెల్లూరులో రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణ రెడ్డిపై ఆకతాయిలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం కారణం ఏదైనాప్పటికీ, అలాంటి సంఘటనలు చాలా బాధాకరం అని అన్నారు. రోజు రోజుకు వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి గమనించి, ఆత్మ నూన్యతతో విచక్షణరహితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారు ప్రజాస్పందన గ్రహించి సక్రమంగా నడుచుకోకపోతే రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

బొమ్మల డిజైనింగ్‌పై చిన్నారులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులు పాల్గొన్నారు. కలాంకురం ఫ్యాషన్ డిజైనర్, డైరెక్టర్ కుమారి అల్లు ప్రియాంక నెట్ క్లాత్‌తో ఫ్లవర్, బొమ్మలు డిజైనింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.



చిన్నారులకు బొమ్మల డిజైనింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రియాంక

రైతులను విస్మరించిన వైసిపి : కళా

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

వైసిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని, వారిని పూర్తిగా మట్టు పెట్టాలని చూస్తుందని న్నారు. మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు విమర్శించారు. మండలంలోని గోపాలపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎరువాక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోతో మహిళలు తమ పార్టీకి దగ్గరవుతున్నారన్నారు. అనంతరం భవిష్యత్‌కు గ్యారెంటీలేని అంశాలను (అన్నదాత పథకం, మహాశక్తి, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలను సంపన్నులను చేయడం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు అందించడం) వంటి అంశాలను పాత్రికేయుల సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, పాలకొండ, వీరఘట్టం మండలాల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, తెలుగు యువత అధ్యక్షులు సిరిపురం జగదీష్, చెబోదుల లక్ష్మీనారాయణ, శేషాపు సుగణకరరావు, జాడ శ్రీధర్, కరణం వరహాల నాయుడు, తదితరులు ఉన్నారు.

చంద్రన్న పాలనలో రైతు సంక్షేమం

కురుపాం : చంద్రన్నపాలనలో పంటలు బాగా పండి రైతు సంక్షేమంగా ఉండే వారని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనలో వ్యవసాయం పండుగలా ఉండేదన్నారు. వ్యవసాయ రంగం సగటున 11శాతం వృద్ధి రేటు సాధించడం జరిగిందన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేశారని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా అంటూ రైతును దగా చేసి జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని విమర్శించారు. చంద్రన్న ప్రభుత్వంలో చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీలకు 100శాతం డ్రిప్, లింకర్లను మంజూరు చేసి రైతుల పాలిట దేవుడయ్యాడని, కావున మళ్లీ రానున్న ఎన్నికల్లో చంద్రన్న గెలిస్తేనే రైతు సంక్షేమంగా ఉంటాడని అన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోట వెంకట నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు కోల రంజిత్ కుమార్, కురుపాం మండల కన్వీనర్ కెవి కొండయ్య, అరకు పార్లమెంటల్ అధికార ప్రతినిధి డొంక రామకష్ణ, నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జగదీశ్వరి



ఏరువాకలో భాగంగా దున్నుతున్న మాజీ మంత్రి కళావెంకట్రావు

సాలూరు రూరల్ :లాభసాటి వ్యవసాయం చంద్రన్నతోనే సాధ్యమని టిడిపి సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని శివరాంపురం టిడిపి ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు వివిధ రకాల సబ్సిడీలు, వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ ఇరిగేషన్, బీమా తదితరమైనవి ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అటువంటి పథకాలు తీసివేశారు విమర్శించారు. తిరిగి రైతులకు అన్ని విధాలా లబ్ది చేయడానికి టిడిపి మేనిఫెస్టలో రైతులకు భారీగా నిధులు ఇవ్వడానికి ప్రకటించారని రైతులంతా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయటానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మది చిట్టి, గౌడ్ రమణ, డబ్బు కృష్ణ, భాస్కరరావు, కృష్ణ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు... అడుగంటుతున్న బావులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి ఎండల తీవ్రత 40 డిగ్రీల పైబడి నమోదు కావడంతో బావుల్లోనూ, చెరువుల్లో నీరు అడుగంటుతోంది. దాహార్తి తీర్చుకోవడం కోసం ప్రజలు, పశువులు, పక్షులకు సైతం వెతుకులాట తప్పడం లేదు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. బావులు అడుగంటడంతో నీటి కోసం సమీపంలో ఉన్న కొండవాగులు, చలములపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నారు. మండలంలో 27 పంచాయతీల్లో 670 పైగా బోర్లు ఉన్నాయి. వీటిలో సగం పైగా పాడైపోవడంతో ప్రజలకు తాగునీరు అందడం లేదు. ఎండల ప్రభావంతో బావుల్లోనూ ఐదు అడుగుల లోతులో మాత్రమే నీరు నిల్వ ఉండడం కనిపిస్తోంది మారింది. దీర్ఘకాలంగా ప్రజలు తాగు నీటి కష్టాలు పడుతున్నా ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గ్రావిటీ సిస్టం ద్వారా వచ్చే నీటిని పడుతున్న గిరిజనులు

శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రెడ్డివీధి శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు చందక అనిల్ కుమార్, వంగల దాలి నాయుడు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ శంకర్ తదితరులు శ్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డివీధి చివరలో ఉన్న శ్మశాన వాటికను మున్సిపాలిటీలోని 24, 25 వార్డులకు చెందిన ప్రజలు ఉపయోగిస్తున్నారన్నారు. శ్మశాన వాటికకు రాకపోకలు సాగించేందుకు రహదారి సదుపాయం లేక అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే శ్మశాన వాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిలో భాగంగా బర్నింగ్ షెడ్, వెయిటింగ్ షెడ్, వాటర్ సదుపాయం, రాకపోకలు సాగించేందుకు రహదారి, ప్రహరీ గోడ, మెయిన్ గేట్ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో సంబంధిత అధికారులకు, పాలకులకు ఈ విషయాన్ని తెలియజేసినా ఫలితం లేదన్నారు. తక్షణమే రెడ్డివీధి చివరానున్న శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.

తవ్వారు... మరిచారు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా బోరు బావి ఏర్పాటు చేశారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రెండు నెలల క్రితం బోరును తవ్వారు. అయితే దీనికి మోటారు బిగించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఈ బోరు ఆధారంగా ముందస్తుగానే పైపులైన్లు ఏర్పాటుతో పాటు కుళాయి పాయింట్ కూడా ఏర్పాటు చేశారు. అయితే మోటారు లేకపోవడంతో లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులునిరుపయోగంగా మిగిలాయి. ప్రస్తుతం ఈ గ్రామానికి వండువ ఉపరితల పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి ఏ సమయంలో తాగునీరు వస్తుందో గ్రామస్తులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మోటారు బిగించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మోటారు బిగించకపోవడంతో నిరుపయోగంగా ఉన్న బోరు

సాలూరు తహశీల్దార్‌గా బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మండల తహశీల్దార్‌గా బాలమురళీకృష్ణ నియమితులయ్యారు. ఇక్కడ తహశీల్దార్‌గా ఉన్న వి.రామస్వామి బదిలీపై వెళ్లారు. బాడంగి తహశీల్దార్‌గా పని చేస్తున్న బాలమురళీకృష్ణను ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదివారం ఆయన డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి తన నియామకం గురించి చెప్పారు. మండలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించాలని రాజన్నదొర ఆదేశించారు.



రాజన్నదొరకు పూలమొక్క అందజేస్తున్న తహశీల్దార్



బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీశెట్టి

తెలుగుజాతి కీర్తి శిఖరం బాలు

ప్రజాశక్తి - జామి

ప్రపంచంలోనే అద్భుతమైన గాయకుడిగా పేరు తెచ్చుకున్న మహోన్నత వ్యక్తి తెలుగు జాతి కీర్తి శిఖరం ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యమని డాక్టర్ పివిజి రాజు కళావేధిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. ఆదివారం మండలంలోని అట్టాడ బిఎన్ఆర్ ఆశ్రమంలో బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 భాషల్లో దాదాపు 45 వేల పాటలు పాడిన బాలు భారతీయ సంగీత విద్వాంసులు మనోఫలకంపై చెరగని ముద్ర వేశారన్నారు. సంగీత సామ్రాజ్యాన్ని అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయిన బాలు, తన కమ్మని గొంతుతో పాడిన పాటలు ప్రపంచ వ్యాప్తంగా సంగీత అభిమానులకు అందచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బాలు పుట్టినరోజు సందర్భంగా వేడుకలు చేయాలనీ, బాలుపేరుతో యువ సంగీత కళాకారులకు అవార్డులు అంద చెయ్యాలని కోరారు.

మృతులకు ఘన నివాళులు అర్పించిన వృద్ధులు

ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బహనగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన కోరమండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో మృతి చెందిన సుమారు 288 ఆత్మకి శాంతి కలగాలని బిఎన్ఆర్ ఆశ్రమంలోని వృద్ధులు కొవ్వొత్తులను వెలిగించి ఘన నివాళులు అర్పించారు. ప్రమాదంలో గాయపడిన సుమారు 1175 మంది త్వరగా కోలుకోవాలని, ప్రమాదంలో చనిపోయిన పేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత రీతిన ఆదుకోవాలని, వారికి విద్యా, ఉపాధి అవకాశాలు అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆశ్రమం నిర్వాహకులు మట్టా రామగున్న, అచ్చిరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో జ్యేష్టాభిషేకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం జ్యేష్టాభిషేకాలు జరిగాయి. ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు శ్రీరామచంద్రస్వామి వారికి ఉష్ణతాప నివారణ కొరకు అభిషేకం నిర్వహిస్తుంటామని ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు తెలిపారు. దీనిలో భాగంగా ప్రాతఃకాలర్చన, అనంతరం బాలబోగం తర్వాత ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనారాధన పుణ్యాహవచం నవకల శారదన అర్చకులు నిర్వహించి జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామి వారికి పంచామృతాలు, పళ్ళరసాలు వివిధ నది జలాలతో అబిషేకం వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం వాస్తవ్యులు అయ్యల సోమయాజుల బాస్కరరావు కుటుంబ సభ్యులు అబిషేక ద్రవ్యాలు కైంకర్యం చేశారు.

దేవాలయంలో సామూహిక వ్రతములు

మండలంలోని కొత్తపేట గ్రామం రామతీర్థం దారిలో ఉన్న చిన్న అన్నవరం రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయించుకు న్నారు. ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ మాట్లాడుతూ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో చిన్న అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కళ్యాణ మండపాల నిర్మాణం చేసి ఇదే దేవాలయ ఆవరణలో పెళ్లిళ్లు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రతినెల పౌర్ణమి, ఏకాదశి నాడు చేయిస్తామన్నారు.



జేష్ఠాభిషేకం చేస్తున్న అర్చకులు



నీటికుంటలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో లచ్చయ్యపేట సమీపాన రాష్ట్రీయ రహదారి పక్కనగల నీటిగుంటలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది సోమేశ్వరరావు, అప్పలకొండ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు, ఎరుపు రంగు షర్టు, నీలం జీన్ ప్యాంటు టక్ చేసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే సీతానగరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు ఫిట్స్ వంటి వ్యాధి వ్యాధి లక్షణాలతో చనిపోయాడా, ఇంకేమైనా జరిగిందా అన్నది కూడా పోలీసుల విచారణ చేయాల్సి ఉంది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో ఆదివారం ఆటో డ్రైవర్‌పై ఐదుగురు మైనర్లు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. కోటదుర్గమ్మ జంక్షన్‌లో పాలకొండ పట్టణం గొల్లవీధికి చెందిన జవ్వాది శ్రీను అనే ఆటో డ్రైవర్ ఆటోను తీసుకువస్తుండగా ఘటాలడెప్పి వీధికి చెందిన ఐదుగురు మైనర్లు ఆటో ఎక్కి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిగారు. అయితే రూ.50 చెల్లించాలని రూ.10 రాయితీ ఇస్తున్నానని, రూ. 40 చెల్లిస్తే చాలని ఆటో డ్రైవర్ చెప్పగా వారంతా ఆగ్రహం చెంది రూ.20 చెల్లిస్తామని ఘర్షణకు దిగారు. అంతేకాక అందులో ఉన్న ఒక మైనర్ ఆటోడ్రైవర్‌ను కత్తితో పొడిచాడు. దీంతో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. చుట్టుపక్కల ఉన్నవారు గమనించి ఆటో డ్రైవర్‌ను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మైనర్లను ఆదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఆటోను ఢీకొన్న కారు ; నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రాష్ట్ర రహదారిలో చినబోగిలి సమీపంలో ఆదివారం కారు ఆటోను ఢీ కొట్టిన సంఘటనలో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాల మేరకు కొమరాడకు చెందిన జెడ్పీ మాజీ చైర్మన్ గుల్లిపల్లి సుధాకరరావు కారులో విశాఖ నుంచి తన స్వగ్రామమైన కొమరాడ వెళ్తుండగా చినబోగిలి వచ్చేసరికి టైరు పంక్చరు అయ్యింది. దీంతో అదుపుతప్పిన కారు జోగంపేట నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో జోగింపేటకు చెందిన ఎస్.లక్ష్మి, కిరణ్, నిడగల్లకు చెందిన ఎస్.సంజీవ నాయుడు, ఆటో డ్రైవర్ ఎస్.సంపత్ కుమార్ గాయాల పాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు ఎఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు, ఆటో

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్ల బురిడిలో పాత కక్షల నేపథ్యంలో చింతల ప్రసాద్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన చింతల లక్ష్మణరావు ఆదివారం దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రసాద్‌ను ప్రాథమిక చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

భోగాపురం : విశాఖలోని గీతం కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన భార్యాభర్తలు మృతి చెందారు. భోగాపురం మండలంలోని కొండరాజుపాలెం గ్రామానికి చెందిన భార్యభర్తలు మైలపల్లి పెద్దయ్య, పావని తమ మూడేళ్ల పాపతో కలిసి స్వగ్రామం నుంచి బైక్‌పై విశాఖ వెళుతుండగా వాహనం అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. పాప తీవ్ర గాయాలతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతోంది.